వైఎస్ఆర్
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
మంగళవారం 30 జూన్ 2026






## బద్వేల్‌లో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



**బద్వేలు అర్బన్, జూన్ 29, ప్రభాతవార్త**

బద్వేల్ పురపాలక సంఘం పరిధిలోని ఎస్‌కేడీ నగర్ స్వర్ణ వార్డులో జరుగుతున్న ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న డిజిటలైజేషన్ పనుల పురోగతిని ఆయన పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా, తప్పులేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందించాలని సూచించారు.

## జగనన్న ఇళ్లకు వసూలు చేసిన డబ్బు వెనక్కి ఇవ్వాలి

### లబ్ధిదారులకు రూ.5లక్షలు లోను మంజూరు చేయాలి
### మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా



**ప్రొద్దుటూరు క్రైం, జూన్ 29, ప్రభాతవార్త:**

ప్రొద్దుటూరు అర్బన్ మరయు రూరల్ ప్రాంతాల్లో 24వేల మందికి జగనన్న సెంటు స్థలం ఇచ్చి పట్టా ఇచ్చారు. కానీ ప్రభుత్వం రూ.5లక్షలు లోన్లు ఇస్తామని ఇవ్వడం లేదని పట్టణ పేదల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు కొరపాటి సత్య నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లు నిర్మించి ఇస్తామని రూ.35వేల నుంచి రూ.లక్ష వరకు పేదల నుంచి కోట్లు వసూలు చేశారు కానీ ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం రూ.5లక్షలు లోన్లు మంజూరు చేసి 3 సెంట్లు స్థలం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కమిషనర్ కలెక్టరుతో మాట్లాడి డబ్బులు తిరిగి ఇచ్చేలా ప్రయత్నం చేస్తానని తెలిపారు. తమకు న్యాయం జరిగే వరకు ధర్నా ఉధృతం చేస్తామని సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి విజయ్‌కుమార్, డీవైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, ఐద్వా అధ్యక్షురాలు విజయ, ఉపాధ్యక్షురాలు రాములమ్మ, సీపీఎం నాయకులు శేఖర్, డేవిడ్, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆకేపాటి దోచుకున్న ప్రభుత్వ
# భూములు కక్కిస్తాం

### అర్హులైన పేదలకు భూములు పంచడమే లక్ష్యం
### టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

**రాజంపేట, జూన్ 29 ప్రభాతవార్త:**

ప్రజలు పదవులు ఇచ్చింది దోచుకోవడానికి, దాచుకోవడానికి కాదని, సేవ చేసేందుకని, అధికారం ముసుగులో పెత్తనం దారీతనం ఎల్లకాలం సాధ్యం కాదని, ఇది ప్రజా ప్రభుత్వమని, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి అరాచకాలకు ప్రజలే చరమగీతం పాడతారని టిడిపి రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. ఆకేపాడు ప్రాంతంలో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు అంటే ప్రభుత్వ పెద్దల భూములు కాదనీ గుర్తు చేశారు.అవి ప్రజల ఆస్తి అని ,ప్రభుత్వ పెద్దలు కేవలం సంరక్షకులు మాత్రమే అని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నామని ప్రభుత్వ భూములన్నీ తమవే అంటూ అప్పనంగా ఆక్రమించి అమ్మేసిన వైకాపా పెద్దలకు ప్రభుత్వం గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. వైకాపా నేతల నుంచి ప్రభుత్వ భూములను కొనొద్దంటూ ప్రజలకు చమర్తి విజ్ఞప్తి చేశారు.భూ దోపిడిపై చర్చకు సిద్ధమా అని వైసిపి నాయకులకు చమర్తి సవాల్ విసిరారు.మీ దోపిడి కోసం మీరు పుట్టిన ప్రాంతాన్ని నాశనం చేస్తారా అని ప్రశ్నించారు. ఏనాడైనా మీ ప్రాంత అభివృద్ధికి పాటుపడ్డారా అని నిలదీశారు.ఇలాంటి దోపిడి దారుల నిజస్వరూపాన్ని ప్రజలు ఇప్పటికైనా గమనించాలని కోరారు. వైసిపి హయంలో వేల ఎకరాలు భూ దోపిడి చేసిన చరిత్ర వైకాపా నాయకులదే అన్నారు.భూ దోపిడి సాధ్యకాదనే జిల్లా కేంద్రాన్ని,మెడికల్ కాలేజీ నీ,పరిశ్రమలు ఇక్కడికి రాకుండా వైసిపి నాయకులు అడ్డుకున్నారనీ ధ్వజమెత్తారు.కూటమి ప్రభుత్వం రాగానే భూ దొంగల అసలు రంగు బయట పడుతోందన్నారు. ప్రభుత్వ భూములు ఎవడి అబ్బ సొత్తు అని దోచుకొని,కంచెలు వేసి,ఎస్టేట్ లు నిర్మించారనీ మండిపడ్డారు.మీ దోపిడి కి అమాయక దళితులను పావులుగా వాడుకుంటున్నారనీ విరుచుక పడ్డారు.వైకాపా నాయకుల రాజకీయం అంతా భూ దోపిడి,అక్రమ సంపాదన,అవినీతి తప్ప ఇంక ఏమి లేదనీ విమర్శించారు.భూ దోపిడి చేసి దొరికినా నిస్సిగ్గుగా వైకాపా నాయకులు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. అధికారం అడ్డం పెట్టుకొని దోచుకున్న ప్రతి ఎకరా స్వాధీనం చేసుకొని,కూటమి ప్రభుత్వ హాయంలో పేదలకు పంచుతాం అన్నారు. అవినీతి పరులకు ఓట్లు వేస్తే దోపిడి ఎలా ఉంటుందో వైసీపీ నాయకులను చూస్తే తెలుస్తుందన్నారు. రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములు ఇకనైనా పేదలకు మంచి పెట్టాలనిడిమాండ్ చేశారు. ఆదివారం అధికారులు స్వాధీనం చేసుకున్న భూములు కేవలం ఒక నాతో మాత్రమేనని, ఆఖరి మీద భూములు కూడా రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ చంగల్ రాయుడు, సొసైటీ ఛైర్మన్ ములుగురు సుబ్రహ్మణ్యం నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, మండల అధ్యక్షులు మేడికొండ రవికుమార్ నాయుడు, మాజీ పట్టణ అధ్యక్షులు సంజీవరావు, మాజీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడగల కుమార్,ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మంద శ్రీనివాసులు. పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కే కరీం పాల్గొన్నారు.

## తహసిల్దార్ కార్యాలయానికి తాళం

### కేసు నమోదు



**దువ్వూరు, జూన్ 29, ప్రభాతవార్త:**

స్థానిక తహసిల్దార్ కార్యాలయానికి సంజీవరెడ్డి పల్లె గ్రామానికి చెందిన ఒక రైతు తన భూమి సమస్య పరిష్కారం కాలేదనే ఉద్దేశంతో సోమవారం ఉదయం తహసిల్దార్ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలియజేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. సంజీవరెడ్డి పల్లె గ్రామానికి చెందిన నాగ కృష్ణారెడ్డి అనే రైతు తనకు సంబంధించిన 22 సెంట్ల భూమి సబ్ డివిజన్ అయిందని అయితే ఆన్ లైన్ ఎక్కకపోవడంతో గత కొద్ది రోజులుగా తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. తన సమస్య ఎప్పటికీ పరిష్కారం కాలేదని ఉద్దేశంతో సోమవారం ఉదయం స్థానిక తహసిల్దార్ కార్యాలయానికి వచ్చి కార్యాలయానికి తాళం వేశాడు. దీంతో కార్యాలయానికి వచ్చే సిబ్బందికి ఆటంకం కలిగింది. ఈ విషయంపై స్థానిక తహసిల్దార్ సంజీవరెడ్డి దువ్వూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమ విధులకు ఆటంకం కలిగించాడని, తాసిల్దార్ కార్యాలయానికి తాళం వేయడం చట్ట రీత్యా తప్పు అని తన ఫిర్యాదులో పేర్కొనడంతో ఏఎస్ఐ భూషణం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అర్జీల పట్ల బాధ్యతాయుతంగా స్పందించాలి

### జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు



**కడప, జూన్ 29 : ప్రభాతవార్త:**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందిన అర్జీల పట్ల బాధ్యతాయుతంగా స్పందిస్తూ.. అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని డిఆర్వో మల్లికార్జునుడు అన్ని శాఖల అధికారులను ఆదేశించారుసోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డి ఆర్ ఓ మల్లికార్జునుడు హాజరై ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా డి ఆర్ ఓ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోందన్నారు. ఈ వేదిక ద్వారా అందే అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని, అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ క్లినిక్ ల ద్వారా భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలని, జిల్లా అధికారులకు అందిన అర్జీలను పరిష్కరించేందుకు సమయం కేటాయించి సమీక్ష చేయాలన్నారు.

## 22-ఏ భూ సమస్యలకు చెక్

### జాయింట్ కలెక్టర్, సబ్‌కలెక్టర్‌లు



వన్-బీ పత్రాలను పంపిణీ చేస్తున్న జేసి, సబ్‌కలెక్టర్‌లు

**మదనపల్లె, జూన్ 29 ప్రభాతవార్త :**

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న 22-ఏ భూ సమస్యలకు పరిష్కారం అయినట్లు జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ, సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణిలు తెలిపారు. మదనపల్లె, రాయచోటి, పీలేరు సబ్‌డివిజన్‌ల పరిధిలో ఏళ్ళుగా పరిష్కారం కాని 9మంది రైతులకు సంబంధించిన 29.26ఎకరాల భూ సమస్యలను పరిష్కరించినట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. సోమవారం మదనపల్లె కలెక్టరేట్‌లో భూ సమస్యల పరిష్కారంకు సంబంధించి పిజిఆర్ఎస్ సమావేశపు హాలులో ఆయన మాట్లాడుతూ ఆయా డివిజన్‌ల పరిధిలో వచ్చిన ధరఖాస్తులను సంబందిత పాత రికార్డులు, దస్త్రాలను పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు. ముఖ్యంగా 5ఏళ్ళ నుంచి 7ఏళ్ళ వరకు పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని పరిష్కరించడం జరిగిందన్నారు. భూ రికార్డులు సరిగా ఉండడం రైతులకు అత్యంత కీలకం అన్నారు. పంటరుణాలు, భూమి లావాదేవీలు, ప్రభుత్వ పథకాల లబ్ధిపొందడంలో వెబ్‌ల్యాండ్ రికార్డులు ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. మిగిలిన ధరఖాస్తులు కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

## జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్
# పనులు పరిశీలన



**జమ్మలమడుగు, జూన్ 29, ప్రభాతవార్త:**

జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె వద్ద గల రాయలసీమ జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ పనులను జులై నెల 3వ తేదీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పరిశీలిస్తున్న సందర్భంగా [illegible] జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జిల్లా తెదేపా అధ్యక్షులు భూపేష్ సుబ్బరామిరెడ్డిలతో పాటు జిల్లా కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌లు సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## పిజిఆర్ఎస్‌లో 332 అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు

### జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ


అర్జీలు స్వీకరిస్తున్న దృశ్యం

**మదనపల్లె, జూన్ 29 ప్రభాతవార్త :**
పిజిఆర్ఎస్ అర్జీల నుంచి పరిష్కారం వరకు ప్రజలకు భరోసా కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ తెలిపారు. సోమవారం మదనపల్లె కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ వేదికలో జిల్లాలో వివిధ మండలాలకు చెందిన ప్రజలు సమస్యలపై 332 అర్జీలను జాయింట్ కలెక్టర్‌కు సమర్పించారు. ఈసందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ద్వారా అందిన ప్రజల సమస్యలపై నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణయిత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ ధరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారానికి ఆయా అధికారులకు జాయింట్ కలెక్టర్, సబ్‌కలెక్టర్లు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌తో పాటు సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌డిసి మాధవకృష్ణారెడ్డిలు పాల్గొని అర్జీదారుల నుంచి ధరఖాస్తులు స్వీకరించారు.

## బహుజన యువసేనచే ఉచితంగా విద్యాసామాగ్రి


విద్యాసామాగ్రిని పంపిణీ చేస్తున్న దృశ్యం

**మదనపల్లె, జూన్ 29 ప్రభాతవార్త :**
బహుజన యువసేన ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. సోమవారం అమ్మచెరువుమిట్టలోని స్థానిక మున్సిపల్ స్కూల్‌లో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా విద్యాసామాగ్రి పంపిణీ చేసినట్లు బహుజన యువసేన అధ్యక్షులు పునీత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యాశాఖ అధికారి ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొని విద్యాసామాగ్రిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తూ బహుజన యువసేన ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.

## అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న కంచి సూరిని పరామర్శించిన ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి


కంచి సూరిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి

**పీలేరు జూన్ 29 ప్రభాతవార్త:**
తెలుగుదేశం పార్టీ పీలేరు పట్టణ అధ్యక్షులు దలవాయి సురేష్ కుమార్ రెడ్డి కంచి సూరి ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. సోమవారం పీలేరు పట్టణం ఇందిరమ్మ కాలనీ లోని ఆయన నివాసానికి వెళ్లిన పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కంచి సూరిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సూరి పార్టీకి సీనియర్ నాయకులు. పట్టణ అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేస్తున్నారు. ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచనలు పాటిస్తూ పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా సేవలోకి రావాలని కోరుకుంటున్నానని సూచించారు. పీలేరు పట్టణంలోని యలమంద క్రాస్ కావలి పల్లికి చెందిన టిడిపి నాయకులు అనీఫ్ సతీమణి షకీలా అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆమెను పరామర్శించారు. ఆమె ఆరోగ్యం గురించి కుటుంబ సభ్యుల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కంచి సూరి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## " నేస్తం " చేయూత...విద్యార్థుల భవితకు బాట...!



**చౌడేపల్లి, జూన్ 29 ప్రభాతవార్త**
పేద విద్యార్థులకు చదువుకు పేదరికం అడ్డుకారాదనే సంకల్పంతో " నేస్తం ఫౌండేషన్ " మరోమారు తన ఉదారతను చాటుకొంది. మండలంలోని గడ్డంవారిపల్లి, పరికిదొన పంచాయతీ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సుమారు రూ. 4లక్షల విలువ చేసే విద్యాఉపయోగకర వస్తువులందించింది. సంస్థ అధినేత గువ్వల కేశవరెడ్డి ఆధ్వర్యంలో తెల్లనీళ్ళపల్లెలోని ప్రాథమిక పాఠశాల నందు మాజీ సర్పంచ్ గువ్వల రాజేశ్వరమ్మ చేతుల మీదుగా విద్యార్థులకు రాతపుస్తకాలు, పెన్నులు వంటి విద్యాఉపయోగకర వస్తువులందించారు. అదే విధంగా అన్ని పాఠశాలలకు సరఫరా చేసారు. సర్కారు విద్యాసంవత్సరం ప్రారంభ దశలో పిల్లలకు ఇంత పెద్దమొత్తంలో విద్యా సామాగ్రిని అందించిన నేస్తం ఫౌండేషన్ ప్రతినిధి కేశవరెడ్డి, మాజీ సర్పంచ్ గువ్వల రాజేశ్వరమ్మలకు ఎంఈఓ కేశవరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఏరువాక పౌర్ణమి-2026 కార్యక్రమం



**జమ్మలమడుగు, జూన్ 29, ప్రభాతవార్త:**
ఏరువాక పౌర్ణమి 2026 కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యవసాయ శాఖ తరుపున జమ్మలమడుగు మండలం పొన్నతోట గ్రామం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరు కూరి, ప్రభుత్వ విప్ మరియు జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డిలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, నాయకులు భూపేష్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయి నుండి జనసేన పార్టీని బలోపేతం చేద్దాం

### జనసేన నేత పప్పిరెడ్డి మహేశ్వర్ రెడ్డి

**రాయచోటి, జూన్ 29. ప్రభాతవార్త :**
గ్రామ స్థాయి నుండి జనసేన పార్టీని బలోపేతం చేద్దామని జనసేన పార్టీ రాయచోటి నియోజకవర్గం నేత పప్పిరెడ్డి మహేశ్వర్ రెడ్డి జనసేన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాయచోటి నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పప్పిరెడ్డి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందులో భాగంగా రాజంపేట పార్లమెంట్ పరిధిలో జనసేన పార్టీ తరపున శ్రీనివాసరావు విచ్చేసి అవగాహన కల్పించాలన్నారు. ఇందులో భాగంగానే సోమవారం రాయచోటి నియోజకవర్గం పరిధిలోని జనసేన నాయకులకు,కార్యకర్తలకు,వీర మహిళలకు పార్టీ నిర్మాణ సారథ్యం గురించి దిశా నిర్దేశం చేశారు. ఈ క్రమంలోనే రాయచోటి నియోజకవర్గం పరిధిలోని 6 మండలాల్లో జనసేన పార్టీ స్థాపించిన నాటి నుండి పని చేసిన నాయకులు కార్యకర్తలు,మధ్యలో పార్టీలో చేరి కష్టపడుతున్న వారు నియోజవర్గ స్థాయి జనసేన పార్టీ కార్యాలయంలో సంప్రదించి జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే గ్రామపంచాయతీ స్థాయి,మండల స్థాయి, నియోజకవర్గ, పార్లమెంట్ స్థాయిలలో పార్టీ కోసం కష్టపడి పని చేస్తూ



పదవులు కావాలని ఆసక్తి కలిగిన జనసేన పార్టీ నేతలు,కార్యకర్తలు రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ కార్యాలయాన్ని సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నిమ్మనపల్లి పవన్ కుమార్,బుడ్డా నాగభూషణం,పద్మావతి, కొండ, వేల్పుల వీరేంద్ర,రెడ్డి ప్రసాద్ నాయుడు, సంజీవ, వెంకటేష్, బుల్లెట్ విజయ్,నరసింహులు, బాలాజీ, నాగేంద్ర తదితర,కార్యకర్తలు పాల్గొన్నారు.

# జనసేనలో పదవుల కోసం వివరాల సేకరణ

### సేవల ఆధారంగానే పదవులు.. జనసేన నాయకులు మాదాసు మురళీ

**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 29, ప్రభాతవార్త:**
జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పార్టీ కోసం కృషి చేసిన కార్యకర్తలకు వివిధ స్థాయిల్లో బాధ్యతలు అప్పగించే ప్రక్రియ చేపట్టినట్లు జనసేన కడప పార్లమెంటు నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ సభ్యుడు మాదాసు మురళీ తెలిపారు. సోమవారం స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లో జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రం కడపలోని హరిత హోటల్‌లో జూలై 1 బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పార్టీ పదవులపై ఆసక్తి ఉన్న ఔత్సాహికుల నుంచి బయోడేటాలను స్వీకరిస్తామని తెలిపారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు వివిధ బాధ్యతల కోసం ఈ వివరాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. పార్టీలో ఎవరి సిఫారసులతోనూ పదవులు రావని, పార్టీ అధినేత తీసుకునే నిర్ణయమే అంతిమమని మాదాసు మురళీ స్పష్టం చేశారు. తాము కేవలం ఔత్సాహికుల వివరాలను పార్టీ అధిష్ఠానానికి అందించే బాధ్యతను మాత్రమే నిర్వహిస్తున్నామని తెలిపారు. గత 13 సంవత్సరాలుగా పార్టీ



ఈ విలేకరుల సమావేశంలో జనసైనికులు అల్లం చంద్రశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

కోసం చేసిన సేవలు, కార్యక్రమాల వివరాలు, సంబంధిత ఫోటోలు, ఇతర ఆధారాలతో పాటు బయోడేటాను సమర్పించాలని ఆయన కోరారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు లభించేలా ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.

## వరకట్నం వేధింపుల కేసు నమోదు

**ప్రొద్దుటూరు క్రైం, జూన్ 29, ప్రభాతవార్త:**
ప్రొద్దుటూరు పట్టణంలోని మున్సిపల్ కాలనీలో నివాసం ఉంటున్న సిరివెళ్ల ఇసాక్ మరియు సుజాతల కుమార్తె ప్రియాంకను నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం గొడిగెనూరు గ్రామానికి చెందిన ఇండ్ల భరత్‌కుమార్‌తో 2025 ఆగస్టులో వివాహం జరిగింది. ప్రస్తుతం భరత్‌కుమార్ నంద్యాల జిల్లా ఫింగర్ ప్రింట్ సబ్ ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. వివాహం అయినప్పటి నుంచి తన భార్య ప్రియాంకను మానసికంగా, శారీరకంగా హింసించి అదనపు కట్నం కావాలని వేధించేవాడు. ఇప్పటి వరకు తన భార్యను కాపురానికి పిలుచుకుపోలేదని పలుమార్లు పెద్ద మనుషుల ద్వారా పంచాయతీ చేసనా ఒప్పుకోలేదని బాధితురాలు చెప్పారు. ఈ మేరకు బాధితురాలు ప్రియాంక ఆమె తల్లిదండ్రులు ప్రొద్దుటూరు ఏఎస్పీ విభూకృష్ణను ఆశ్రయించారు. బాధితురాలు ప్రియాంక భర్త భరత్‌కుమార్ అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ప్రొద్దుటూరు వన్‌టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## చినుకు పులకరించే రైతు ఖరీఫ్ సాగు ప్రారంభం



**పీలేరు, జూన్ 29 ప్రభాతవార్త**
తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఈ ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారిన తరుణంలో ఎట్టకేలకు పీలేరు మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో సోమవారం పలువురు రైతులు పొలాలోల వేరుశెనగ విత్తనాలు విత్తుతూ బిజీగా కన్పించారు. మరోవైపు ఏరువాక పౌర్ణమి కావడంతో రైతులు శుభదినంగా భావించి వేరుశెనగ విత్తనాలు భూమిలో వేయడానికి మక్కువ చూపారు.

**50 శాతంరాయితీతో కందులు...**

ఖరీఫ్ సాగులో రైతులకు అనువుగా 50 శాతం కందులు పంపిణీ చేయడానికి అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని ఏడీఏ కరుణాకర్ రెడ్డి తెలిపారు. పీలేరుల మండలంలో 12 క్వింటాళ్లు, కేవీపల్లె మండలంలో 18 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

## ప్రభుత్వ స్థలంలో బోర్డులు నాటిన అధికారులు

### వార్తకు స్పందన




**బద్వేలు, జూన్ 29, ప్రభాతవార్త**
గోపవరం మండలంలో కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా.. అనే శీర్షికన వార్తా పత్రికలో సోమవారం కథనం ప్రచురితమైన విషయం పాఠకులు తెలిసిందే. గోపవరం మండలంలోని సర్వే నెంబర్లు 16 మరియు 36లో ఉన్న సర్వే నెంబర్లలోని సుమారు 1 ఎకరా 53 సెంట్ల ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఇందుకు స్పందించిన ఆర్డిఓ, రెవెన్యూ అధికారులను ఆదేశించడంతో భూములలో ఆర్డీవో ఆదేశాల మేరకు దశలమేరకు హెచ్చరిక బోర్డు నాటడమే కాకుండా అక్కడ ఎలాంటి ఆక్రమణలు కాకుండా కంచెను ఏర్పాటు చేసి తగు ఏర్పాట్లు చేశారు ప్రభుత్వ భూమి కబ్జాలకు పాల్పడితే ఎంతటి వారైనా సరే చర్యలు తప్పవని ఆర్డీవో హెచ్చరించారు.

## పార్టీలో ఎదుగదలను ఓర్వలేక మా నేతలపై నిందలా

### గండికోట సుధాకర్

**రాయచోటి జూన్ 29 ప్రభాతవార్త**
కొమ్మర గంగాధర కుటుంబ సమస్యలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు అనుచరుల పై అసత్య ఆరోపణలు చేయడం సంస్కారవంతం అనిపించుకోదని రాయచోటి రూరల్ మండలం అధ్యక్షుడు గండికోట సుధాకర్ ఆరోపించారు. ఆయన సందర్భంగా మాట్లాడుతూ : లక్కిరెడ్డిపల్లి మండలం పందిలపళ్ళ గ్రామానికి చెందిన కొమ్మర గంగాధర్ భూ వివాదంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి,అయన కుటుంబ సభ్యులతో పాటు అనుచరుల పై చేసిన అసత్య ఆరోపణలను ఆయన ఖండించారు. భూ సమస్యలను ఆధారాలతో న్యాయం చేయించుకోవాలి తప్ప ప్రజల కోసం ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న తమ నేతల పై బురద చల్లడం హేయమైన చర్య అన్నారు. చేస్తే సహించబోమని ఈ సందర్భంగా అయన హెచ్చరించారు.

# మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో జాతీయ పక్షి సందడి

### కుక్కల బారిన పడకుండా కాపాడిన సిబ్బంది
### సురక్షితంగా అడవిలోకి చేర్చిన అటవీ శాఖ అధికారులు



**మదనపల్లెక్రైం, జూన్ 29 ప్రభాతవార్త.**
మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రి ఆవరణలో సోమవారం ఉదయం అడవి నుంచి దారి తప్పి వచ్చిన జాతీయ పక్షి నెమలి కాసేపు సందడి సృష్టించింది. ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్ ఆవరణలోకి వచ్చిన నెమలి అక్కడ ఇటు అటూ తిరుగుతూ అందరినీ ఆకట్టుకుంది. ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులు నెమలిని ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఆసుపత్రి ఆవరణలో సంచరించే కుక్కల కంట పడకుండా ఉండేందుకు ఆసుపత్రి సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. పక్షికి ఎటువంటి హాని జరగకుండా చుట్టుపక్కల చేరకుండా అడ్డుకుంటున్నారు. నెమలి భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రి యాజమాన్యం వెంటనే స్థానిక అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వెంటనే అటవీ శాఖ సిబ్బంది ఆసుపత్రికి చేరుకుని ఆ నెమలిని తిరిగి సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలిపెట్టేందుకు తీసుకెళ్లారు. జాతీయ పక్షి క్షేమంగా బయటపడటంతో ఆసుపత్రి సిబ్బంది, రోగులు ఊపిరి పీల్చుకున్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా గొర్ల ముదివీడుకు ప్రత్యేక బస్సు



**రాయచోటి జూన్ 29 ప్రభాతవార్త**
మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చొరవతో రవాణా సమస్యకు శాశ్వత పరిష్కారం అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలోని గొర్ల ముదివీడు ఉన్నత పాఠశాల విద్యార్థులు, విద్యార్థినులు చాలాకాలంగా రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేంద్ర రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో విద్యార్థుల ఇబ్బందులను తెలుసుకున్న వెంటనే మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పందించి, సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. వారి చొరవతో గొర్ల ముదివీడు ఉన్నత పాఠశాల కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయబడింది. ఇకపై ఈ బస్సు నిత్యంగొర్ల ముదివీడు మార్గంలో ప్రయాణిస్తూ విద్యార్థులకు సురక్షితమైన, సమయపాలనతో కూడిన రవాణా సౌకర్యాన్ని అందించనుందని విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలి

### నల్లమల రామాంజులు



**సంబేపల్లి జూన్ 29 ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తి అంతరాలను తొలగించి అన్ని పాఠశాలలకు ఒకే విధంగా ఉపాధ్యాయులను కేటాయించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు నల్లమల రామాంజులు ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం జరుగుతున్న వర్క్ అడ్జస్ట్మెంట్ లో 30/06/26. వరకు ఉన్న స్ట్రెంత్ ని బట్టి వర్క్ అడ్జస్ట్మెంట్ జరుగుతుందన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్ లలో గతంలో పనిచేసిన విద్యాశాఖ కమిషనర్ గారు 45 మంది ఉన్నా కూడా మోడల్ ప్రైమరీగా పాఠశాలలుగా మార్చారని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం 45 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా కొనసాగుతున్నాయి. అటువంటి పాఠశాలలు అన్నింటిని మోడల్ ప్రైమరీగా మార్చాలి (లేదా) 40 మంది విద్యార్థులు ఉన్న ప్రతి ప్రాథమిక పాఠశాలకు మూడో పోస్టు కేటాయించాలని 40 మంది దాటిన ప్రతి పాఠశాలకు తప్పనిసరిగా మూడో పోస్టు ఇవ్వాలన్నారు. మరి సింగల్ టీచర్లు ఉంటే ఐదు తరగతుల విద్యార్థులకు సమార్థవంతంగా ఎలా బోధన చేయగలరు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నా కూడా 59 విద్యార్థులు ఉన్న బేసిక్ ప్రైమరీ స్కూల్లో బోధన కష్టతరంగానే ఉంటోంది. ఫౌండేషన్ స్కూల్లో, బేసిక్ ప్రైమరీ స్కూల్లో సింగల్ టీచరు ఉంటే లేడీ టీచర్ అయితే 27 రోజులు మేల్ టీచర్ అయితే 22 రోజులు సెలవులు తీసుకుంటారు కొంతమంది మంచి టీచర్స్ 10 లేదా 12 సెలవులతోనే సంవత్సరాన్ని పూర్తిచేస్తారు మరి వాళ్ళు సెలవులు తీసుకున్నప్పుడు అక్కడి పాఠశాలలకు ఎవరిని పంపాలి? ఎంఈఓ లకు సమస్య అవుతుంది. ఒక కాంప్లెక్స్ కు కాంప్లెక్స్ టీచర్ ని ఒకరిని ఇచ్చారు ఎందుకంటే టీచర్లు ఎక్కువగా ఉన్నారు కాబట్టి ఇచ్చారు ఆ కాంప్లెక్స్ టీచర్ ని ఉపయోగించు కోమంటున్నారు. రాష్ట్రంలో కనీసం ఈ విషయాలను ఆలోచించి ఒక్కో మండలానికి కనీసం వాలంటీర్లు అయినా ఒక పదిమందిని ఇచ్చి సక్రమంగా ఎంఈఓ లు ఉపయోగించేటట్లు చేస్తే ఎడ్యుకేషన్ సిస్టం చాలా బాగుపడుతుంది ఎంతో అభివృద్ధి చెందుతుంది కనీసం ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

## హామాలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

### ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

**మదనపల్లె, జూన్ 29 ప్రభాతవార్త :**
జిల్లాలోని సివిల్ సప్లై శాఖలో పనిచేస్తున్న హామాలీలకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద హామాలీలతో కలసి నిరసనలు వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల మొదటివారంలోనే వేతనాలు చెల్లించాలని సంబంధిత అధికారులను అనేకసార్లు కొరుకున్నప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల హామాలీలు ఆర్తికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం జిల్లా జాయింట్‌కలెక్టర్‌కు పిజిఆర్ఎస్‌లో విన్నవించి హామాలీలు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరడం జరిగిందన్నారు. హామాలీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి పట్టణ కార్యదర్శి తిరుమల, దేవా, గణపతి, హామాలీలు రాజేష్, ఆంజినేయులు, రఫి, ఇబ్రహీం, చలపతి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సైనికుడు మృతికి నివాళులు



**కడప, జూన్ 29 ప్రభాతవార్త :**
కడప జిల్లా మాజీ సైనిక పెన్షనర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ పి మరెన్న ఆకస్మిక మృతికి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జెడ్ ఫిలిప్స్ ,కమిటీ సభ్యులు మాజీ సైనికులు అందరూ మరెన్న మృతికి ఘనంగా నివాళులు అర్పించారు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారికి ఏ అవసరమున్నను మా అసోసియేషన్ తరపున మీకు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

## ట్రిపుల్ ఐటీకి చౌడేపల్లి ఉన్నతపాఠశాల విద్యార్థి



**చౌడేపల్లి, జూన్ 29 ప్రభాతవార్త**
మండల కేంద్రమైన చౌడేపల్లి ఉన్నతపాఠశాల విద్యార్థి ఎస్.మహ్మద్ తల్‌హా ట్రిపుల్ ఐటీకీ ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయుడు సి.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. తాజాగా జరిగిన పది పరీక్షల్లో మహ్మద్ తల్‌హా 566మార్కులు సాధించాడు. ఈమేరకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి బాలుడు ఎంపికయినట్లు ఆయన వివరించారు. అదే విధంగా ఈనెల 14న గోసలకురపల్లికి చెందిన నందినీబాయి ఒంగోలు ట్రిపుల్ ఐటికి ఎంపికయిన విషయం విధితమే. దీంతో చౌడేపల్లి ఉన్నతపాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రభుత్వబడిలో అత్యధిక మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికయినందున విద్యార్థులు, ఉపాధ్యాయులను స్థానికులు అభినందించారు.

## ఎస్ఐఆర్ సర్వే కార్యక్రమం పై హెల్ప్ డెస్క్ ఏర్పాటు

### తహసిల్దార్ శివకుమార్



**పీలేరు, జూన్ 29 ప్రభాతవార్త:**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సర్వే కార్యక్రమానికి ఓటర్లకు అనువుగా స్థానిక చెన్నారెడ్డి కాలనీలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఇంటింటా సర్వేలో భాగంగా స్థానిక చెన్నారెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ లో సోమవారం 230 నుంచి 239 బూతులకు సంబంధించి సర్ సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎం. శివకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 63,323 మంది ఓటర్లకు గానూ 59,591 మందికి ఎలిమినేషన్ ఫారంలను అందజేసి 90 శాతం నమోదు కాగా ఇప్పటి వరకు 7,980 తిరిగి స్వీకరించినట్లు తెలిపారు. ఈ హెల్ప్ డెస్కు ఫారంల పంపిణీ, ఫారం నింపే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్వ మురగయ్య. ఏఎస్వో రెడ్డెప్పనాయుడు. వీఆర్ వోలు సిద్ధయ్య, సుధాకర్, నారాయణ, బీఎల్ వోలు, వివిధ పార్టీల బీఎల్ఏలు పాల్గొన్నారు.

## వైభవంగా భీమేశ్వరస్వామి తిరునాళ్ల



**పెండ్లిమర్రి, జూన్ 29, ప్రభాతవార్త:**
పెండ్లిమర్రి మండలం ఏలూరు పాడు సమీపంలో వెలసిన భీమేశ్వర స్వామి తిరునాళ్ల సోమవారం వైభవంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చి స్వామి వారికి పూజలు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం సమీపంలో భక్తులను సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం బండ లాగుడు పోటీలు వైభవంగా నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే భక్తులకు భారీగా అన్నదానం నిర్వహించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా సీఐ చల్లని దొర, ఎస్సై తులసీ నాగప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ స్వామిని వైభవంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఓటరు మ్యాపింగ్ కార్యక్రమం విజయవంతం చేయాలి

### సూపర్‌వైజర్ శాంతకుమార్‌రెడ్డి




**కలికిరి, జూన్ 29, ప్రభాతవార్త:**
మండలాల్లో సర్ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఓటర్ల మ్యాపింగ్ కార్యక్రమాన్ని బీఎల్ఓలు వేగవంతం చేయాలని సర్ కార్యక్రమం సూపర్‌వైజర్ ఎం.శాంతకుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ పోలింగ్ బూతుల పరిధిలో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని శాంతకుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్ కార్యక్రమంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, బీఎల్ఓ గుణశేఖర్, ఓటర్లు పాల్గొన్నారు.

**ఉద్యోగ ప్రకటన**

ప్రొద్దుటూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు నందు పనిచేయుటకుగాను 19-06-2023 వ తేదీన సహకార సంఘముల కమీషనర్ గారు మంజూరు చేసిన పోస్టులకు లోబడి ప్రస్తుతము ఖాళీగా ఉన్నటువంటి క్లర్క్ పోస్టును తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయుటకు బ్యాంకు పాలకవర్గము తీర్మానము చేయడమైనది. అంతేగాక అభ్యర్థుల వయస్సు సడలింపు కోరుతూ 20-12-2025 వ తేదీన బ్యాంకు మహాజనసభ చేసిన తీర్మానము మేరకు గవర్నమెంట్ ఉద్యోగులతో సమానముగా ఉండునట్లు బ్యాంకు బైలా నెం. 4(C) చేసిన సవరణను సహకార సంఘముల కమీషనరువారు 14-06-2026 వ తేదీన ఆమోదము తెలిపిన మేరకు మరియు బ్యాంకు సర్వీస్ రూల్స్ నిర్ణయింపబడిన అర్హతగల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.

**నిబంధనలు**

1) అభ్యర్థులు ఏదైన డిగ్రీ పాసై ఉండవలెను. కంప్యూటర్ నందు అనుభవము కలిగి ఉండవలెను. B.Com. కంప్యూటర్స్ గాని, M.B.A. చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
2) 30-09-2026 వ తేదీకి అభ్యర్థుల వయస్సు 42 సంవత్సరాలు మించరాదు.
3) దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను స్టాఫ్ కమిటీచే ఇంటర్వ్యూ జరిపి ఎంపిక చేయబడును.
4) అర్హత గల అభ్యర్థులు వారియొక్క బయోడేటా వివరములు 06-07-2026 వ తేది సాయంత్రం 5-00 గం॥లలోపు టౌన్ బ్యాంకు C.E.O. గారికి అందజేయవలెను.
5) ఎంపిక కాబడిన అభ్యర్థులు 1 సంవత్సరము ప్రొబేషన్ కాలము పూర్తి చేయవలెను. నియమింపబడే అభ్యర్థులకు క్లర్క్ రూ. 6875/- మూల వేతనము మరియు బ్యాంకు రూల్స్ ప్రకారము కరువు భత్యము, ఇంటి అద్దె చెల్లించబడును.

**ఎంపిక విధానము :**
అభ్యర్థులను ఎంపిక చేయు విధానములో స్టాఫ్ సెలక్షన్ కమిటీదే తుది నిర్ణయము.

**దరఖాస్తు పంపవలసిన చిరునామా :**

చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,
ది ప్రొద్దుటూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్,
డోర్ నెం. 10/650, కె.కె. స్ట్రీట్,
ప్రొద్దుటూరు - 516 360.
వై.యస్.ఆర్. కడప జిల్లా.

బి.వి. సుబ్బారెడ్డి
అధ్యక్షులు
ది ప్రొద్దుటూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్,
ప్రొద్దుటూరు

## సహకార వారోత్సవాలకు శ్రీకారం

**ముద్దనూరు, జూన్ 29 ప్రభాతవార్త:**



భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న సహకార వారోత్సవాల సందర్భంగా సోమవారం ముద్దనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో సహకార జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు రాజుల సురేంద్రనాథ్ రెడ్డి సహకార జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ, సహకార సంఘాలు రైతులు, గ్రామీణ ప్రజల ఆర్థికాభివృద్ధికి కీలకమని, సహకార స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. డైరెక్టర్లు ఉత్తమా రెడ్డి, మురళి మాట్లాడుతూ రైతులు సంఘం అందిస్తున్న రుణాలు, డిపాజిట్ పథకాలు, ఇతర సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ప్రియాంకకు ట్రిబుల్ ఐటీలో సీటు

**బద్వేలు అర్బన్, జూన్ 29, ప్రభాతవార్త**



బద్వేల్ మండలం తిప్పనపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి ప్రియాంక ప్రతిభతో రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందింది. పదో తరగతిలో 584 మార్కులు సాధించిన ఆమెకు రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ శ్రీకాకుళం క్యాంపస్‌లో ప్రవేశం లభించింది. ప్రియాంక బద్వేల్‌లోని పొన్నవోలు గోపిరెడ్డి ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, ప్రియాంక మొదటి నుంచే చదువులో ప్రతిభ కనబరిచేదని, క్రమశిక్షణతో చదివి ట్రిబుల్ ఐటీలో సీటు సాధించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. ప్రియాంక మాట్లాడుతూ తన విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహమే కారణమని, భవిష్యత్తులో సివిల్ సర్వీసెస్‌లో ఉత్తీర్ణత సాధించి గ్రామానికి సేవ చేయడమే తన లక్ష్యమని తెలిపింది. ఈ సందర్భంగా గ్రామస్థులు, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

## కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

**మదనపల్లెక్రైం, జూన్ 29 ప్రభాతవార్త.**



కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ భీమలింగ తెలిపారు. సీఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామసముద్రం పట్టణంకు చెందిన నాగరాజా (47), ప్రశాంత్ కుమార్ (30)లు కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో మదనపల్లె ఎక్సైజ్ ఎస్సై దొరికాస్, సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వారి వద్ద నుంచి 62 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, వారిని అరెస్ట్ చేయడం జరిగింది. అరెస్ట్ చేసిన ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ ఆలీ, కానిస్టేబుల్స్ నాగరాజు, మని, గంగమహేశ్వరీ పాల్గొన్నారు.

## ఘనంగా మొహరం పండుగ



**కాశినాయన జూన్ 29 ప్రభాతవార్త**

మండల పరిధిలోని వరికుంట్ల ఆకుల నారాయణపల్లె తదితర గ్రామాలలో మొహరం వేడుకలు ఘనముగా నిర్వహించారు. సోమవారం చివరి రోజు మొహరం వేడుకలను కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో పేర్ల వద్దకు వచ్చి మొహరం వేడుకలు ఘనంగా నిర్వహించారు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు వేషాల ఆధారాలతో ప్రజలు ఆకట్టుకుంటూ సాయంత్రం అలువ తదితర కార్యక్రమాలతో మొహరం పండుగను ఘనంగా నిర్వహించారు పీర్ల పండుగ సందర్భంగా జనాలు తండోపతండాలుగా వచ్చి ఊరేగింపులో పాల్గొన్నారు ఎస్సై యోగేంద్ర ఆదేశాల మేరకు పలు గ్రామాలలో పోలీస్ సిబ్బంది ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పీర్ల పండుగ నిర్వహించేందుకు కృషి చేశారు ఈ కార్యక్రమమును విజయవంతం చేశారని ప్రజలు వాపోతున్నారు.

## జల్ జీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలి

**వేంపల్లె జూన్ 29 ప్రభాతవార్త**



ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు లక్ష్యంతో భారత ప్రభుత్వం చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనులు త్వరగా పూర్తి చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. సోమవారం వేంపల్లి లో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటి కనెక్షన్ అందించాలనే లక్ష్యంతో పులివెందుల నియోజకవర్గంలో 480 కోట్ల రూపాయలు వెచ్చించి 600 ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి విస్తృతంగా పనులు కొనసాగుతున్నాయన్నారు."జల్ జీవన్ మిషన్" ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయన్నారు. పనుల నాణ్యతను కాపాడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.గ్రామీణ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత, అభివృద్ధికి జల్ జీవన్ మిషన్ ఒక కీలకమైన కార్యక్రమమని పేర్కొంటూ, ఈ పథకం విజయవంతం కావడానికి ప్రజల సహకారం కూడా అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్ బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర బోయిన రవి యాదవ్ ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు ముద్ది శివకృష్ణ పాల్గొన్నారు.

## బద్వేల్‌లో టీడీపీ నేతల భేటీ..

**బద్వేలు అర్బన్, జూన్ 29, ప్రభాతవార్త**

ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్, టీడీపీ బద్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ మంచూరు సూర్యనారాయణరెడ్డిని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి కడప జిల్లాలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలు, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన పార్టీ కార్యాచరణపై చర్చించినట్లు తెలిపారు. అలాగే, ప్రజా జీవితంలో తనకు ఎదురైన అనుభవాలు, రాజకీయ ప్రయాణంలో నేర్చుకున్న పాఠాలు, ప్రజలతో మమేకమై పనిచేసే విధానం, పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన వ్యూహాలపై మంచూరు సూర్యనారాయణ రెడ్డి తన అభిప్రాయాలను మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డితో పంచుకున్నట్లు సమాచారం. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సేవాభావంతో పనిచేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఆత్మీయ వాతావరణంలో జరిగిన ఈ భేటీలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మరింత చేరువ కావాలని, పార్టీ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నాయకులు ఆకాంక్షించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.



# ఇంటి దొంగతనం కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష

**6 తులాల బంగారు ఆభరణాల చోరీ కేసులో తీర్పు... రూ.వెయ్యి జరిమానా విధించిన కోర్టు**

**పులివెందుల, జూన్ 29, ప్రభాతవార్త :**

నియోజకవర్గ పరిధిలోని సింహాద్రిపురం మండలానికి చెందిన అంకాలమ్మగూడూరు గ్రామంలో జరిగిన ఇంటి దొంగతనం కేసులో నిందితుడు దివాకర్ కు పులివెందుల జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. నేరం రుజువు కావడంతో నిందితుడు దివాకర్‌కు న్యాయమూర్తి చంద్రశేఖర్ రెడ్డి ఈ మేరకు తీర్పు వెలువరించారు. పోలీసుల వివరాల ప్రకారం అంకాలమ్మగూడూరు గ్రామానికి చెందిన ఏనుగుల రామలక్షుమ్మ ఇంట్లో 2025 జూన్ 8న దొంగతనం జరిగింది. ఇంట్లో ఉన్న 6 తులాల బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు సింహాద్రిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు దివాకర్‌ను గుర్తించిన పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి చోరీకి సంబంధించిన రూ.3 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సాక్ష్యాధారాలను కోర్టు ముందు ప్రవేశపెట్టడంతో నేరం రుజువైంది.విచారణ అనంతరం నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కేసు దర్యాప్తులో సహకరించిన పోలీసులను అధికారులు అభినందించారు.



దొంగతనం కేసులో జైలు శిక్ష పడ్డ దివాకర్

## ఆర్టీఐ దరఖాస్తు సమర్పించిన సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు




**బద్వేలు, జూన్ 29, ప్రభాతవార్త**

గోపవరం మండలంలో గత తహసీల్దార్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి బదిలీ అయ్యే వరకు జారీ చేసిన ఎన్వోసీలు జెన్యూన్ సర్టిఫికెట్లు, ఎండార్స్‌మెంట్‌లు, పొజిషన్ సర్టిఫికెట్ల వివరాలను సమాచార హక్కు చట్టం-2005 ప్రకారం అందించాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు సోమవారం ఆర్టీఐ దరఖాస్తు సమర్పించారు. జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్. చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు కే. జకరయ్య, బి. అనిల్ తదితరులు డిప్యూటీ తహసీల్దార్ సత్యమూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్ 6(1), 2() ప్రకారం తెలుగు భాషలో ప్రతి పత్రానికి సంబంధించిన జిరాక్స్ కాపీలతో సమాచారం అందించాలని కోరినట్లు తెలిపారు. 2022లో గోపవరం మండలంలో నకిలీ పత్రాల వ్యవహారంపై అప్పటి తహసీల్దార్ ఫిర్యాదు మేరకు బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై ప్రస్తుతం కోర్టులో విచారణ కొనసాగుతోందన్నారు. గతంలో సమాచారం కోరినప్పుడు సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారని ఆరోపిస్తూ, ప్రస్తుతం సమాచార హక్కు చట్టం ప్రకారం పూర్తి వివరాలను వెల్లడించాలని త్రిభువన్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా కమిటీ సభ్యులు కే. బాబు, ఎం. విజయరావు, కే. జైపాల్, టి. చంద్రపాల్, తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ట

**కలసపాడు, జూన్ 29 ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన కలసపాడులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో శ్రీ సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. పురోహితులు వారణాసి వెంకటరమణయ్య ఆధ్వర్యంలో యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ జ్వాలా దర్శనము బలి హారణము తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు 1987 నుంచి 1992 సంవత్సరం 6 తరగతి నుంచి 10 తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు సరస్వతీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 10వ తరగతి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## జీఎస్టీపై అవగాహన సమావేశం




**ప్రొద్దుటూరు అర్బన్ , జూన్ 29, ప్రభాతవార్త:**

జీఎస్టీ డే 10వ సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా సోమవారం స్థానిక పద్మశాలీయ కళ్యాణ మండపంలో కడప జిల్లా టాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్ అసోసియేషన్ ప్రొద్దుటూరు శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి కడప జిల్లా సిజిఎస్టీ శాఖ అధికారులు హాజరయ్యారు. సూపరింటెండెంట్ లు వి. వెంకటేశ్వర్లు, జ్ఞానేంద్ర కుమార్, అలాగే ప్రొద్దుటూరు శాఖకు చెందిన సూపరింటెండెంట్లు ఏ. వెంకట సాయి వివేక్, జి. శివ శంకర్ పాల్గొని జీఎస్టీ చట్టంలో ఇటీవల వచ్చిన మార్పులు, చేర్పులపై విపులంగా వివరించారు. జీఎస్టీ విధానం అమలు, తాజా సవరణలు, పన్ను చెల్లింపుదారులకు కలిగే లాభాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తూ అధికారులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా ట్యాక్స్ ప్రాక్టీషన్స్ అండ్ కన్సల్టెంట్ అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ పొలంకి వరదరాజులు, ప్రధాన కార్యదర్శి అవ్వారు శ్రీనివాసులు, కార్యదర్శి వద్ది నాగరాజు, ఏపీ టీపీసీఏ ఈసీ మెంబర్ పి. సుబ్బరాయుడు, బి. అనంతపద్మనాభయ్య, బొలిశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

**పీలేరు, జూన్ 29 ప్రభాతవార్త:**

పీలేరు మండలం ముదుపులవేములు పంచాయతీ ఠాణావడ్డిపల్లె మిట్ట మలుపు వద్ద చిత్తూరు కడప జాతీయ రహదారిలో ఆటోను కారు ఢీకొన్న విషాద సంఘటనలో ముగ్గురు మృతి చెందగా, మరో ఏడుగురు గాయపడ్డ విషయం విదితమే. ఈ ప్రమాదంలో గాయపడ్డ కె. మొహ్మద్ నౌహిద్ (18) సోమవారం మృతి చెందాడు. వివరాలిలావున్నాయి. ఈ నెల 25న రాత్రి పీలేరు మండలం రేగళ్లకు చెందిన బాబాఫకృద్దీన్ కుటుంబసభ్యులు ఆటోలో కలికిరి మండలం దూదేకులపల్లెకు పీర్లపండుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఠాణా వడ్డిపల్లె మిట్ట మలుపువద్ద కారు వేగంగా వెళ్లి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో కె. మెహరూబ్బీ, మొహ్మద్ వాహిద్, ఆటో డ్రైవర్ ముబారక్ మృతి చెందారు. మరో ఏడుగురు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. మొహ్మద్ నౌహిద్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందినట్లయింది.

## సమస్యల పట్ల వెంటనే స్పందించాలి

**దువ్వూరు, జూన్ 29, ప్రభాతవార్త:**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే సమస్యల పట్ల వెంటనే స్పందించాలని మండల తహసిల్దార్ సంజీవరెడ్డి, ఎంపీడీవో సుబ్బారెడ్డిలు అన్నారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వర్గాల నుండి వచ్చిన వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంబంధిత అధికారులు వచ్చిన సమస్యలను నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని తెలిపారు. వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం యూరియా, డిఏపి పంపిణీకి గాను ప్రత్యేక యాప్ ఏర్పాటు చేసిందని దాని ద్వారానే రైతులు కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మీ నారాయణ, ఏఈ సుబ్రహ్మణ్యం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## భీమా కుటుంబానికి ధీమా

**ప్రొద్దుటూరు అర్బన్ జూన్ 29, ప్రభాతవార్త**

భీమా కుటుంబానికి ధీమా అని కోటక్ లైఫ్ ఇన్సూరెన్స్ తెలుగు రాష్ట్రాల ఇన్చార్జి కెవెన్ రెడ్డి అన్నారు. సోమవారం ప్రొద్దుటూరు పట్టణంలోని గాంధీ రోడ్డులో ఐసీఐసీఐ బ్యాంకుపై అంతస్తులో కోటక్ లైఫ్ ఇన్సూరెన్స్ నూతన బ్రాంచ్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఎస్పీ విభూ కృష్ణ హాజరై బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ శ్రీనాథ రెడ్డి, ఎల్ఎంపి మురళీ రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ దేవకుమార్, ఏజెన్సీ పార్ట్నర్లు, అడ్వైజర్లు పాల్గొన్నారు.

## పెన్నానదిలో యువకుడు మృతి

**సిద్ధవటం, జూన్ 29 ప్రభాతవార్త**



పెన్నా నదిలో పడి కన్న కొడుకు మృతి చెందడంతో తండ్రికి గుండె కోత మిగలడంతో కన్నీరు మున్నీరయ్యారు సిద్ధవటం మండలం లింగంపల్లి గ్రామం పెన్నా నదిలో ఆదివారం కడప నగరం నుండి గంగాధర్, మహేంద్ర, సోమశేఖర్, వెంకటేష్, నాగేంద్రబాబు, మహేష్ బాబు, వెంకటసుబ్బయ్య, జగదీష్ అనే యువకులు పెన్నా నది వద్దకు చేరుకొని సరదాగా ఈత కొడుతుండగా జగదీష్(26) అనే యువకుడు పెన్నా నదిలో ఊబిలో చిక్కుకొని మృతి చెందిన యువకుడు గుంటూరు జిల్లా, చెరువు పల్లె గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు ఇతను ఏడాది నుండి కడప నగరంలోని భాగ్య నగర్ కాలనీలో ఓలో ఎలక్ట్రికల్ బైక్ షో రూమ్ లో మెకానిక్ పనిచేస్తూ జీవనం కొనసాగించేవాడు కన్న కొడుకు పెన్నాలో మృతి చెందిన విషయం తెలిసి తండ్రి గోపి ఆదివారం మధ్యాహ్నం ఫోన్ చేస్తే ఫోన్ లిఫ్ట్ చేయలేదని మరల ఫోన్ చేస్తే వేరే అబ్బాయిలు ఫోను ఎత్తి మీ కుమారుడు పెన్నాలో కొట్టుకొని పోయాడని సమాచారం ఇచ్చారని కన్నీరు మున్నీరయ్యారు పోలీసులు సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని పేర్కొన్నారు మృతి చెందిన వ్యక్తిని శవాన్ని పరీక్షలు నిమిత్తం పోలీసులు అంబులెన్స్ లో కడప రిమ్స్ తరలింపు చేశారు ఈ విషయమై మండల ఎస్సై హారిక వివరణ కోరగా తండ్రి గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

## వెల్లాలలో సుందరకాండ ప్రవచనం

**రాజుపాలెం, జూన్ 29, ప్రభాతవార్త.**



మండల పరిధిలోని వెల్లాలా పుణ్యక్షేత్రంలో శ్రీ సంజీవరాయ స్వామి నూతన ఆలయ ప్రారంభోత్సవం, కుంభాభిషేకం కార్యక్రమం లో భాగంగా సోమవారం పుణ్యక్షేత్రంలో ప్రత్యేకపూజలు ప్రారంభమైన సందర్భంగా వేదాంత గీతా శివం పౌండేషన్ అధ్యక్షులు శ్రీ అభినవ శంకరానంద స్వామి ప్రవచనాలు భక్తులకు వినిపించారు. సుందరకాండ కార్యక్రమంలో శ్రీ ఆంజనేయ స్వామి దృఢ సంకల్పము కార్యదీక్షపరుడు, శ్రీరాముని గొప్పతనం అంశాలను భక్తులకు వివరించారు. ప్రస్తుత సమాజంలో హిందూ ధర్మం ప్రజల్లోకి ప్రబలుతున్నట్టు దాంతో భక్తి మార్గంలో ప్రజల పయనిస్తున్నారని ఆయన తెలిపారు. ఇది హిందూ ధర్మ సంస్కృతి పరిరక్షణ జరుగుతున్నట్లు అయినా వర్ణించారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**పులివెందుల, జూన్ 29,ప్రభాత వార్త :**



పట్టణంలోని బ్రాహ్మణ పల్లి రోడ్డు ఎస్బీఐ కాలనీ 4వ లైన్‌లో ఆదివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇంటిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికంగా నివాసముంటున్న కుప్పం శ్రీరాములు శెట్టి ఇంటిలో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే శ్రీరాములు శెట్టితో పాటు ఆయన తల్లిదండ్రులు ఇంటి మిద్దెపై నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. దీంతో ఇంట్లోని సామగ్రికి మంటలు అంటుకుని టీవీ, ఫ్రిజ్, దివాన్ కాట్, దుస్తులు తదితర వస్తువులు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.50 వేల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని కుటుంబ సభ్యులు తెలిపారు.విద్యుత్ పరికరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పాత వైరింగ్‌లు, లోపభూయిష్టమైన విద్యుత్ కనెక్షన్లను వెంటనే సరిచేసుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని అధికారులు ఆదుకోవాలని కోరుతున్నారు.

## సర్‌పై అవగాహన సదస్సు

**దువ్వూరు, జూన్ 29, ప్రభాతవార్త:**

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పన చేసేందుకు సర్ కార్యక్రమాన్ని చేపట్టారని దీనిపై అవగాహన కలిగి ఉండాలని తహసిల్దార్ సంజీవరెడ్డి, ఎంపీడీవో సుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం సర్ ఓటర్ల జాబితాపై ఎన్యుమినేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దువ్వూరు మండలంలో ఇంతవరకు 99శాతం ఓటర్లకు ఫారాలు అందజేశారని అయితే 22శాతం డిజిటల్ చేశారన్నారు. డిజిటల్ కార్యక్రమంలో దువ్వూరు మండలం చాలా వెనుకబడి ఉందని దీనిని వెంటనే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఓటర్ల నుండి ఎన్యుమినేటర్ ఫారాలు స్వీకరించేటప్పుడు అన్ని సక్రమంగా పూర్తి చేశారా లేదా గమనించాలని తెలిపారు. అనుకున్న లక్ష్యాన్ని జులై 15వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. ఓటర్ల జాబితాపై ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కేంద్ర ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటుందని అందువల్ల జాగ్రత్తగా సర్ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ సదస్సులో బిఎల్వోలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.



## సిబ్బంది కొరతతో ఖాతాదారుల అవస్థలు

**బ్రహ్మంగారిమఠం జూన్ 29 ప్రభాతవార్త**

బ్రహ్మంగారిమఠం మండల కేంద్రం లోని వున్నటువంటి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సిబ్బంది కొరతతో ఖాతాదారులు అవస్థలు పడుతున్నారు. ముందుగా వున్న ఇద్దరు కర్ల్కు లు పదోన్నతి పొంది మరొక చోటుకు వెళ్లిపోయారు. ఒక ఫీల్డ్ ఆఫీసర్ బదిలీ అయ్యారు. ఖాతాదారులు ఎక్కువగా వున్నందు వలన సిబ్బంది తక్కువగా ఉండడం వలన బంగారు తనఖా పెట్టి వ్యవసాయ పనులకు రుణం తీసుకొనే వాళ్లకు, వ్యవసాయ పాసుపుస్తక పెట్టి తనఖా పెట్టి రుణం తీసుకోవాలన్న బ్యాంక్ లో పనులు కాక చంటి పిల్లలను తీసుకువచ్చే మహిళలకు గంటల గంటలు ఆలస్యంగా అవుతుండడం ఒక పని మీద వస్తే ఆ పని కాకపోవడంతో ఖాతాదారులు విసుగు చెందుతున్నారు. ఇక నైనా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజ్మెంట్ చొరవ చూపి బ్రహ్మంగారిమఠం బ్రాంచ్ కు సిబ్బంది పంపిస్తారని ఖాతాదారులు ప్రజల కు మెరుగైన సేవలు అందిస్తారని కోరుతున్నారు.




## నల్లగొండ వారిపల్లెలో వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ట

**గుట్టపై కొలువైన స్వామివారికి ప్రత్యేక పూజలు**

**భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం**



**పులివెందుల, జూన్ 29,ప్రభాత వార్త :**

పులివెందుల మండల పరిధిలోని నల్లగొండ వారిపల్లె గ్రామంలో గుట్టపై వెలసిన ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమం గ్రామస్తుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించి పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు.ఉదయం ఆలయం వద్ద వేద పండితుల ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. విగ్రహ పునఃప్రతిష్ట సందర్భంగా ఆలయం వద్ద ఉదయం నుంచి చెక్కభజనలు, భక్తి గీతాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహంతో గ్రామంలోని పురవీధుల్లో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. చెక్కభజనలు, బ్యాండ్ వాయిద్యాల నడుమ భక్తులు స్వామివారి నామస్మరణ చేస్తూ ఉత్సవంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొని విజయవంతం చేశారు. ఆంజనేయస్వామి ఆలయ పునఃప్రతిష్టతో గ్రామంలో భక్తి భావం మరింత పెరిగిందని గ్రామస్తులు తెలిపారు.

## కడప జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం (రూరల్) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దొంతు సతీష్

**వేంపల్లి జూన్ 29 ప్రభాతవార్త**



కడప జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం (రూరల్)వర్కింగ్ ప్రెసిడెంట్ గా వేంపల్లెకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ దొంతు సతీష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం (రూరల్)వర్కింగ్ ప్రెసిడెంట్ గా వేంపల్లెకు చెందిన దొంతు తిరుపాలయ్య శెట్టి (లేట్) కుమారుడు సతీష్ ను నియమించినట్లు కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ వెల్లడించారు. సోమవారం వేంపల్లె అమ్మవారిశాలలో దొంతు సతీష్ ను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం దొంతు సతీష్ వేంపల్లె ఆర్యవైశ్య యువజన సంఘం సెక్రటరీగా, వేంపల్లె అవోపా ట్రెజరర్ గా, జిల్లా అవోపా జాయింట్ సెక్రటరీ గా,గండి శ్రీ వాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం జాయింట్ సెక్రటరీ గా సేవలు అందిస్తున్నట్లు వేంపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తోటంశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. తన సేవలు గుర్తించి ఈ పదవిని అప్పగించారని తెలిపారు.

## భవన నిర్మాణానికి దాతల చేయూత



**పులివెందుల, జూన్ 29,ప్రభాతవార్త :**

సమాజ సేవా కార్యక్రమాలకు వేదికగా నిలవనున్న స్నేహిత అమృత హస్తం సేవాసమితి నూతన భవన నిర్మాణానికి దాతలు తమ వంతు సహకారం అందించారు. భవన నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో పలువురు దాతలు ఆర్థిక విరాళాలు అందజేశారు.ఏఎస్ఐ చంద్రశేఖర్ రావు (స్వామి) కుమార్తె, అల్లుడు సుజనా-దీక్షిత్ దంపతులు రూ.10 వేలు, పెద్దజూటూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి రూ.10 వేలు, సిరి ఫిజియోథెరపీ డాక్టర్ రమణారెడ్డి రూ.10 వేలు, వార్డు మాజీ కౌన్సిలర్ భార్గవి రెడ్డి రూ.5 వేలు విరాళంగా అందించారు. దాతలు నిర్మాణంలో ఉన్న సేవా సమితి భవనాన్ని సందర్శించి తమ సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు మొమ్మెల రాజు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. భవన నిర్మాణానికి సహకరిస్తున్న ప్రతి దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు. దాతల సహకారంతో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మరింత మంది సేవాభావం కలిగిన దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమం లో శ్రీ రాజా కళా నిలయం మాస్టర్ రాజా, సేవాసమితి సభ్యులు రాజు తదితరులు పాల్గొన్నారు. దాతలకు సేవాసమితి తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పంచాయతీ గదుల వేలం పాట

**ఖాజీపేట, జూన్ 29 ప్రభాతవార్త,**

ఖాజీపేట మండల పరిధిలోని జడ్పీకి చెందిన వాణిజ్య గదుల వార్షిక లీజు హక్కుల కోసం 2026 జూలై 1వ తేదీన బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ సెక్రెటరీ సునీత తెలిపారు. వేలానికి వచ్చే గదులు: జడ్పీ కార్యాలయం: రూమ్ నెం. 7, మెయిన్ బజార్: రూమ్ నెం. 2, 4, మార్కెట్: రూమ్ నెం. 1, 11, 13, బస్ స్టాండ్ టోల్ గేట్: 1, వేలం పాటలో పాల్గొనదలచిన వారు జూన్ 30వ తేదీలోపు నిర్దేశిత డిపాజిట్ చెల్లించాలని ఆమె సూచించారు. డిపాజిట్ చెల్లించిన వారికే వేలంలో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. పాల్గొనదలచిన వ్యాపారులు, ఆసక్తిగల వ్యక్తులు గడువులోగా డిపాజిట్ చెల్లించి వేలంపాటకు హాజరుకావాలని కోరారు.

## బాధితులకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి



బద్వేలు అర్బన్, జూన్ 29, ప్రభాతవార్త

పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన మహిళా సుబ్బలక్షుమ్మ అనారోగ్యంతో బాధపడుతుండేది. ఈ నేపథ్యంలో ఆమె ఆరోగ్య ఖర్చుల కొరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.1,60,000 చెక్కును ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి ఆదివారం ఆమె నివాసానికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొనే సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య, స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వార్డు పర్యటనతో సమస్యలు పరిష్కారం : ఎమ్మెల్యే

మదనపల్లె, జూన్ 29 ప్రభాతవార్త :

వార్డుల్లో పర్యటించడం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం మీవార్డులో-మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 32, 34 వార్డుల్లో కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి పర్యటించారు. ఈసందర్భంగా వార్డుల్లో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా నీటి ఎద్దడి, పారిశుద్ధ్యం, రోడ్లు, వీధిదీపాలు మౌళిక వసతుల కల్పనకై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు విన్నవించిన సమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రధానంగా నీటి ఎద్దడి నివారణ, పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత ఉదయం ఎమ్మెల్యే నివాసం వద్ద ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు పలు సమస్యలపై ఎమ్మెల్యేకు విన్నవించడం జరిగింది. ఈ వార్డుబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమీషనర్ ప్రమీల, డిఈ శ్రావణి, ఏఈ రవీంద్రనాయక్, టిడిపి నాయకులు నీలకంఠ, సిద్ధప్ప, ఎరబల్లి వెంకటరమణారెడ్డి, డ్యాన్స్ రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.



వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

## మోసం కేసులో నిందితులకు జైలు శిక్ష

### ఏ1కు రెండేళ్లు, మిగతా వారికి మూడు నెలల జైలు

మదనపల్లెక్రైం, జూన్ 29 ప్రభాతవార్త.



ఇల్లు రాసిచ్చి, అదే ఇంటిని రెండోసారి మరో వ్యక్తికి రాసిచ్చి మోసానికి పాల్పడిన కేసులో నిందితులకు స్థానిక కోర్టు జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు చెప్పింది. మదనపల్లె టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2016లో నమోదైన ఈ కేసుకు సంబంధించిన వివరాలను రెండో పట్టణ సీఐ మహమ్మద్ రఫీ, ఏఎస్ఐ రమణ సంయుక్తంగా వెల్లడించారు. స్థానికంగా నివసించే బాధితుడు పులి వాసుదేవారెడ్డికి నిందితులు మొదట ఒక ఇల్లు రాసిచ్చారు. అయితే, ఆ తర్వాత అదే ఇల్లును రెండోసారి తమ తమ్మునికి రాసిచ్చి, వాసుదేవారెడ్డిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ మోసగించారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరం పూర్తిగా రుజువు కావడంతో బర్మా వీధికి చెందిన రాయచోటి మునెమ్మ (58)కు రెండేళ్ల జైలు శిక్ష, వెంకట సుబ్బయ్య (61), మనోహర్ (36), ఈశ్వరయ్య (35)లతో పాటు ఏపీ నాయుడు కాలనీకి చెందిన ఈ. సుబ్బరాయుడు (48)లకు మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది.

## పిల్లలు విద్య, నైపుణ్యాలు అభివృద్ధి పరుచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

### గురుకుల విద్యార్థినులకు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పిలుపు

పీలేరు జూన్ 29 ప్రభాతవార్త:

విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడలు, ఇతర నైపుణ్యాల్లోనూ రాణించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సూచించారు. పీలేరు-చిత్తూరు మార్గంలోని మహాత్మ జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాలను సోమవారం సందర్శించిన ఆయన విద్యార్థినులకు బట్టలు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు చక్కగా చదివి పాఠశాలకు, తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు, తమ ఉన్నతికై పాటుపడే తల్లిదండ్రులకు మంచి పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. పీలేరు గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినిలు 2025, 26 విద్యా సంవత్సరంలో జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. అలాగే ఏడుగురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం పాఠశాల ప్రతిభకు నిదర్శనమని కొనియాడారు. అన్నమయ్య జిల్లా పరిధిలో నాలుగు మహాత్మ జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గురుకుల విద్యాలయాలు ఉన్నాయని, కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కలికిరిలో కొత్తగా మహాత్మ జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గురుకుల జూనియర్ కళాశాలను మంజూరు చేసిందని తెలిపారు. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కలికిరి జూనియర్ కళాశాలలో చేరాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, వృత్తి నైపుణ్య శిక్షణలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని ఎమ్మెల్యే విద్యార్థినులకు సూచించారు. గురుకుల పాఠశాల శాశ్వత భవనం నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని అడిగిన ప్రిన్సిపాల్ విన్నపం మేరకు స్పందించిన ఎమ్మెల్యే స్థానిక చిత్తూరు రోడ్డులో విద్యా సంస్థ నిర్మాణం కోసం 5 ఎకరాల స్థలాన్ని సర్వే చేసి కేటాయించాలని తహాశీల్దారుకు సూచించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేను విద్యార్థినులు ఆప్యాయంగా స్వాగతించారు. అనంతరం ఆయన విద్యార్థినులతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామమూర్తి, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డప్ప రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మాజీ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, ఇతర నాయకులతోపాటు గురుకుల పాఠశాలల కన్వీనర్ ప్రిన్సిపాల్ సోమశేఖర్, స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఫక్రున్నిసా, ఎంపీడీవో శివశంకర్, డిప్యూటీ ఎంపీటీవోలు యుగంధర్, భీమేశ్వరరావు, తహాశీల్దార్ శివకుమార్, ఎంఈఓలు బాబు నాయక్, పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

## ఉషాకిరణ్ పాఠశాల విద్యార్థిని ట్రిపుల్‌ఐటీకి ఎంపిక

వేంపల్లె జూన్ 29 ప్రభాతవార్త



ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని షేక్ అఫ్నాన్ ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు కరస్పాండెంట్ బి.ఎస్. రమణారెడ్డి తెలియజేశారు. పదవ తరగతిలో 592 మార్కులు సాధించి మండల ఫస్ట్ సాధించినట్లు ఆయన తెలియజేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నతంగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. తమ విద్యార్థిని సాధించిన విజయం పట్ల కరస్పాండెంట్, ఉపాధ్యాయ బృందము, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## పదవీ విరమణ శుభాకాంక్షలు



శ్రీమతి. గంధం. ఎలిజబెత్ సుహాసిని రాణి. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్.వైద్య ఆరోగ్యశాఖ, సంబేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. అన్నమయ్య జిల్లా... 43 సం.ల సుదీర్ఘ ప్రజా ఆరోగ్య సంక్షేమం లో విస్తృత సేవ చేసి నేడు పదవీ విరమణ చేయుచున్న సంగర్భంగా శేష జీవితం ఆ భగవంతుని కృపతో పిల్లలు మనవరాళ్ళ తో ఆరోగ్యంగా క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తూ..

## సోమశిల వెనుక జలాల

# చిన్నారులకు పోలియో చుక్కలు



ఒంటిమిట్ట జూన్.29. ప్రభాతవార్త

పేద బడుగు బలహీన వర్గాల చిన్నారులకు పోలియో చుక్కలు అందడం కోసం ఒంటిమిట్ట మండలం సోమశిల వెనుక జలాల అవతలి గట్టున చేపలు పట్టుకొని నివసిస్తున్న ప్రజల చిన్నారులకు మెడికల్ డాక్టర్ భావన, అరుణకుమారి సారథ్యంలో సోమవారం వైద్య సిబ్బంది పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ భావన, వైద్య సిబ్బంది స్వయంగా పడవ ప్రయాణం చేసి అవతలి గట్టుకు వెళ్లి అక్కడ నివాసముంటున్న ప్రజలకు ఆరోగ్యపరంగా సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. అనంతరం చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయడం జరిగింది. అక్కడ ప్రజలు స్వచ్ఛందంగా వారి పిల్లలకు పోలియో చుక్కలు వేయించి సద్వినియోగం చేసుకోవడం జరిగింది. చిన్నారులకు పోలియో చుక్కలు వేయు నిమిత్తం అవతలిగట్టుకు వెళ్లేందుకు పడవ ఏర్పాటు చేసినందుకు ఫారెస్ట్ అధికారులకు సెక్షన్ ఆఫీసర్ బ్రహ్మయ్య, పడవ డ్రైవర్ శ్రీరాములు, సహాయకుడు సురేష్ కు వైద్య సిబ్బంది ధన్యవాదాలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ వెంకటసుబ్బమ్మ, సూపర్వైజర్ భాస్కర్ రెడ్డి, సుజాత, ఏఎన్ఎం శశికళ పాల్గొన్నారు.

# 15 ఏళ్ల తర్వాత పెద్దజూటూరులో మళ్లీ పీర్ల పండుగ సందడి

పులివెందుల, జూన్ 29, ప్రభాతవార్త :

నియోజకవర్గ పరిధిలోని వేముల మండలం పెద్దజూటూరు గ్రామంలో 15 సంవత్సరాల సుదీర్ఘ విరామం అనంతరం పీర్ల పండుగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తర్వాత సంప్రదాయ వేడుక మళ్లీ జరగడంతో గ్రామమంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది. గతంలో చోటుచేసుకున్న ఓ సంఘటన నేపథ్యంలో గ్రామంలో పీర్ల పండుగ నిర్వహణకు విరామం ఏర్పడింది. అయితే గ్రామ పెద్దలు, అన్ని వర్గాల ప్రజలు సంప్రదాయాన్ని కొనసాగించాలని నిర్ణయించుకుని పండుగ నిర్వహణకు ముందుకు వచ్చారు. ఈ మేరకు పోలీసు అధికారులను సంప్రదించి అనుమతులు పొందారు. భద్రతా అంశాలను దృష్టిలో ఉంచుకున్న పోలీసులు గ్రామ పెద్దలు, వివిధ వర్గాల ప్రతినిధులతో చర్చలు నిర్వహించారు. గ్రామంలో శాంతి భద్రతలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వర్గాల సహకారం తీసుకుని పండుగకు అనుమతులు మంజూరు చేశారు. పీర్ల పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, పీర్ల ఊరేగింపు, సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు. హిందూ, ముస్లిం సోదరులు కలిసి వేడుకల్లో పాల్గొని మత సామరస్యానికి నిదర్శనంగా నిలిచారు. యువత, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతం చేశారు. పండుగ రోజులలో వేముల పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. పోలీసుల సమన్వయం, గ్రామ ప్రజల సహకారంతో వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. 15 ఏళ్ల తర్వాత మళ్లీ తమ గ్రామంలో పీర్ల పండుగ నిర్వహించుకోవడం పట్ల గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో శాంతి, సౌభ్రాతృత్వం కొనసాగాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థనలు నిర్వహించారు. భవిష్యత్తులో ప్రతి ఏడాది పీర్ల పండుగను ఇదే ఉత్సాహంతో నిర్వహించాలని గ్రామ పెద్దలు నిర్ణయించినట్లు తెలిపారు.



పీరు ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్థులు

## అమరావతి అభివృద్ధిపై వైకాపా ద్వంద్వ వైఖరి

### రాజధాని పేరే చెప్పే అర్హత వైసీపీకి ఎక్కడిది

ప్రొద్దుటూరు జూన్ 29 ప్రభాతవార్త



రాజధాని అమరావతి పేరును ప్రస్తావించే నైతిక అర్హత వైకాపా నాయకులకు లేదని నల్లబోతుల నాగరాజు తీవ్రంగా విమర్శించారు. వైకాపా నేతల రాజకీయ తీరు ఊసరవెల్లి స్వభావాన్ని మించిపోయిందని వ్యాఖ్యానించిన ఆయన, అమరావతి రైతుల సమస్యలను పరిశీలించేందుకు వెళ్లిన సందర్భంలో వారు అనుసరించిన వైఖరిపై మండిపడ్డారు. అమరావతి పరిశీలన పేరుతో వెళ్లిన కొంతమంది వైకాపా నాయకులు రైతు పరామర్శ ముసుగులో రౌడీ చరిత్ర ఉన్న వ్యక్తులను తీసుకెళ్లారని, అది రైతులపై ఒత్తిడి తీసుకురావడానికే ఉద్దేశించిందని ఆరోపించారు. అమరావతి "దేవతల రాజధాని" అని అభివర్ణించిన ఆయన, అక్కడ అంబటి రాంబాబు, అవినాష్, పేర్ని నాని వంటి నాయకులకు స్థానం ఏమిటని ప్రశ్నించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు మూతపడే పరిస్థితులు నెలకొనడంతో పాటు కొత్త పరిశ్రమలు రాష్ట్రానికి రాకుండా అడ్డుకోవడం వల్ల నిరుద్యోగం పెరిగిందని ఆయన విమర్శించారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన పార్టీ వైకాపానే అని ఆరోపిస్తూ, అభివృద్ధిని చూసి సహించలేని రాజకీయాలు రాజధాని అంశాన్ని స్వార్థ ప్రయోజనాలకు వాడుకోవద్దని హెచ్చరించారు.

## దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



రాయచోటి జూన్ 29 ప్రభాతవార్త

రాయచోటి బార్ సభ్యులు అడ్వకేట్ రాజేష్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని ఇంతవరకు ముద్దాయిని పోలీసులు అరెస్ట్ చేయకపోవడం దారుణమని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని రాయచోటి జిల్లా కోర్టు సముదాయం ముందు బార్ అధ్యక్షులురమేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలియజేయడం జరిగింది. రాష్ట్రంలో న్యాయవాదుల పైన రోజురోజుకు దాడులు తీవ్రమవుతున్నాయని కొన్ని సందర్భాల్లో అవి దాడులతో సరిపెట్టుకోకుండా అతి కిరాతకంగా హత్యలు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఇటువంటి సంఘటన పునరావతం కాకుండా అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలని ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేస్తున్నాయని అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకొచ్చి ఇటువంటి హింసాత్మక దాడులు ఆపాలని రాయచోటి న్యాయవాదులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాజ మనోహర్, రవిశంకర్, నాగముణి,జగన్మోహన్ రెడ్డి, పగడాల శ్రీనివాసులు, లక్కిరెడ్డిపల్లి ఏజీబీ బాలాజీ రెడ్డి, తాహీర్, ఇద్రైతుల్లా, వెంకటరమణ రాజశేఖర్ రెడ్డి, సుంకు రవీంద్ర నాగాంజనేయులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వాసవిమాత కుంభాభిషేకం

రాజంపేట, జూన్ 29 ప్రభాతవార్త



సర్వశక్తి స్వరూపిణి, ఓంకార రూపిని, శిరులు ఇచ్చే మహాతల్లి, కోరిన కోరికలు తీర్చే మహా కల్పవల్లి రాజంపేట వాసవి మాత కుంభాభిషేకం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఐదు రోజులుగా జరుగుతున్న కుంభాభిషేక ఉత్సవాలు చివరి రోజు భక్తులతో పోటెత్తాయి. కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖర సరస్వతి స్వామి ఆశీస్సులతో కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. రాజంపేట కన్యకా పరమేశ్వరి ఆలయంలో 8 హోమ గుండాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి మేలుకొలుపు అనంతరం గణపతి పూజ నిర్వహించి ఆ తర్వాత ప్రత్యేక పూజలకు రుత్వికులు శ్రీకారం చుట్టారు. శత చండీ హోమం, కలన్య హోమములు, కలాన్యాసం, జ్వాలా దర్శనం, ధేను దర్శనం, కన్యా దర్శనం, సుమంగళి దర్శనం కార్యక్రమాలను హోమాలను వేదమంత్రాలతో రుత్వికులు చేపట్టారు. కుంభాభిషేక మహోత్సవం వేదమంత్రాలతో మార్మోగింది. ఆ తర్వాత సుమూర్తములో కుంభాభిషేక క్రతువు నిర్వహించారు. అనంతరం మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు ఉత్సవాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని రాజంపేట ఆర్యవైశ్య సంఘం నిర్వహించింది. రాజంపేట ప్రాంతంలోనే 125 సంవత్సరాల నాటి ఆలయంలో కుంభాభిషేకం ఎక్కడ జరగకపోవడంతో భక్తులు భారీగా తరలి వచ్చారు. భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు.

## వెల్లాలలో ప్రారంభమైన ప్రత్యేక పూజలు



రాజుపాలెం,జూన్ 29, ప్రభాతవార్త.

మండల పరిధిలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ సంజీవరాయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం మహా కుంభాభిషేకం కార్యక్రమాలు సోమవారం నుండి ప్రత్యేక పూజలతో అంగరంగ వైభముగా శాస్త్రోక్తంగా ప్రారంభమైనవి. వేద పండితుల మంత్రోక్షణలతో మంగళ వాయిద్యాలతో శ్రీ సంజీవరాయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఆలయ చైర్మన్ జివిల్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి లక్ష్మీనరసింహారెడ్డి రాంభూపాల్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, రూరల్ సీఐ నాగభూషణం, ఎస్సై ప్రణయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## రైతుల సేవలో సహకార సంఘం



దువ్వూరు, జూన్ 29, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులో ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం గ్రామీణ ప్రాంత రైతులకు అనేక సేవలు అందిస్తుందని సంఘం అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, పిఓ రామ్మోహన్ లు అన్నారు. సోమవారం కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సహకార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార శాఖకు సంబంధించిన జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సహకార సంఘం కీలక పాత్ర పోషిస్తుంది అన్నారు. సహకార స్ఫూర్తిని ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని తెలిపారు. సహకార సంఘంలో వివిధ రకాల డిపాజిట్లు, రుణాలు వంటి సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం ముద్దు

### విబిజి రాంజీ పథకం వద్దు : తులసిరెడ్డి

వేంపల్లి జూన్ 29 ప్రభాతవార్త



ఉపాధి హామీ పథకం ముద్దు విబిజి రామ్ జి పథకం వద్దు" అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి దీని స్థానంలో వికసిత భారత్ గ్యారంటీ ఫర్ రోజుగార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ పథకాన్ని అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించడం దురదృష్టకరం,శోచనీయమన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒక విప్లవాత్మకమైన,చారిత్రాత్మకమైన పథకమని, ప్రపంచంలోనే అతిపెద్ద గ్రామీణ ఉపాధి హామీ పథకం అని తులసి రెడ్డి అన్నారు. కానీ దురదృష్టవశాత్తు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దాని స్థానంలో వికసిత భారత్ గ్యారంటీ ఫర్ రోజుగా అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కొత్త పథకాన్ని రద్దుచేసి దీని స్థానంలో పాత పథకాన్ని కొనసాగించేటట్లు కృషి చేయాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## జూలై 1న "హెల్తీ 5రీ రన్" నిర్వహణ

పీలేరు, జూన్ 29 ప్రభాతవార్త:

వైద్యుల దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్, పీలేరు ఆధ్వర్యంలో జూలై 1, 2026 (బుధవారం) ఉదయం 6:00 గంటలకు కలికిరి క్రాస్ రోడ్స్‌లోని కపిలేశ్వర హాస్పిటల్ వద్ద "హెల్తీ 5రీ రన్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, ప్రతిరోజూ వ్యాయామం, నడక, పరుగుల ప్రాముఖ్యతను తెలియజేయడం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. వైద్యులు, వైద్య విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది మరియు ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## వలస కార్మికుల చిన్నారులకు

# పోలియో చుక్కలు

మైదుకూరు, జూన్ 29, ప్రభాతవార్త:

మైదుకూరు మండలం, వనిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముదిరెడ్డిపల్లె గ్రామ పరిధిలో మైదుకూరు పోరుమామిళ్ల రహదారికి దూరంగా అడవి ప్రాంతంలో ఉన్న వలస కార్మికుల ప్రాంతానికి వైద్య బృందం చేరి 0 నుండి 5 సం లోపు పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రుల సమక్షంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది విజయవంతంగా నిర్వహించారు. ఈ ప్రాంతంలో సిక్స్ లైన్ డిబిఎల్ కన్ స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారి నిర్మాణ పనుల్లో నిమగ్నమైన వలస కార్మికుల కుటుంబాల వద్దకు నేరుగా వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నాగమ్మ, హెల్త్ అసిస్టెంట్ కమల మోహన్, ఆశా కార్యకర్త నర్సమ్మ పాల్గొని నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతంలో చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయించారు. అలాగే తల్లిదండ్రులకు పోలియో నిర్మూలన ప్రాముఖ్యతను వివరించి, ఐదేళ్లలోపు ఏ ఒక్క చిన్నారూ పోలియో చుక్కలు మిస్ కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.ప్రభుత్వం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వైద్య సిబ్బంది తల్లిదండ్రులను కోరారు.



## బ్రాహ్మణపల్లి సీతారాముల ఆలయంలో ఘనంగా ముగిసిన భాగవత సప్తాహం

### భక్తిశ్రద్ధలతో కలశ ప్రదర్శన

### పండితులకు ఘన సన్మానం



పులివెందుల జూన్ 29 ప్రభాతవార్త :

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి సీతారాముల ఆలయంలో నిర్వహించిన శ్రీమద్భాగవత సప్తాహ పఠనం సోమవారం అంగరంగ వైభవంగా ముగిసింది. వెలిదండ్ల దేవరకొన హరిహర క్షేత్రం భాగవత భక్త సమాజం ఆధ్వర్యంలో, దాతల సహకారంతో వారం రోజుల పాటు ఈ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో కొనసాగింది.ముగింపు కార్యక్రమంలో మహిళలు ఆలయం చుట్టూ కలశాలతో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించి భక్తి భావాన్ని చాటుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా భాగవత పండితులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీ దత్తరాజమునీంద్ర స్వామి, వెంకట నారాయణరెడ్డి, నారాయణరెడ్డి, జయరామిరెడ్డి, రఘురాములు తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భాగవత సప్తాహ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంపై నిర్వాహకులు దాతలకు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.




